# విలువలు

**అమ్మంగి వేణుగోపాల్**

చాలా కాలంగా వెతుకుతున్న పుస్తకం ఆ లైబ్రరీలో కనిపించగానే ఆత్రంగా పుటలు తిప్పుతున్నప్పుడు, నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ,

"రవీ" అని పిలిచిందొక కంఠం.

ఈ దేశంలో నన్ను "రవీ" అని పిలిచేవాళ్ళెవరుంటారా అనుకుంటూ, నన్ను కాదేమో ననుకుంటూ తలపైకెత్తేసరికి, ఆత్రంగా అడుగులు వేసుకుంటూ వస్తున్నాడు–రాజు!

ఆ మహానగరంలో ఒక తెలుగువాడు కనిపించటం, అందునా మనం మరిచిపోలేనివాడు కనిపించటం యెంత గొప్ప అనుభవం!

చాలా ఆప్యాయంగా కావిలించుకొని,

"బాగున్నావా రవీ, ఎన్నేండ్లయింది? ఐదేండ్లయింది కదా" అన్నాడు ఆర్ద్రంగా. ఆ ఆప్యాయతకు క్షణంసేపు నోటమాట రాలేదు.

"అవును రాజూ, ఐదేండ్లయింది. నువ్వు పరీక్షల తర్వాత కలవనే లేదు కదా" విశాలంగా వున్న ఆ హాల్లో ఒక మూలకు వెళ్ళికూచున్నాం. ప్యూన్‌తో అక్కడికే కాఫీలు తెప్పించాడు. అతడక్కడ లైబ్రేరియన్‌గా వుంటున్నాడట. నలిగిన బట్టలు. మాసినగడ్డం. చూపుల్లో మాత్రం అదే చురుకుదనం. నా గురించి చెప్పాను. ఏ ఆఫీసులో ఎంత కాలం నుంచి పనిచేస్తున్నదీ, ఎక్కడ వుంటున్నదీ వగైరా. నా చేతిలో వున్న పుస్తకం చూసి యిచ్చేశాడు. "నాకీ పుస్తకం కావాలి రాజూ, యిప్పిస్తావా? అడిగాను

"లైబ్రరీ దెందుకు? నా దగ్గరుంది రవీ, ఈ రోజు సాయంత్రం అట్లా ఒకసారి మాయింటికొస్తే ఆ పుస్తకం తీసుకోవచ్చు. మాయిల్లు చూసినట్టవుతుంది కూడా" అన్నాడు.

"సరే"నంటూ అడ్రసు తీసుకొని నా పనిమీద వెళ్ళిపోయాను.

X X X

"రవీ" నన్ను కాదనుకొని అవ్యక్తినిదాటబోయాను. "నిన్నే" రవీ అంటూ చేత్తో ఆపాడు.

చిరునవ్వుతో కళ్ళల్లోకి చురుకు చురుకుగా చూస్తున్నాడు.

"సారీ, నా పేరు రఘువీర్" అన్నాను

"అవును, 'రవీ' నీ పేరుకు షార్ట్ ఫామ్.

ఆ రోజు కాలేజీ మెట్లమీద, ఆ విధంగా పరిచయమయ్యాడు రాజు.

రాజుకు పెద్దపేర్లంటే గిట్టదు. ఎంత పెద్ద పేరునైనా ఏదోరకంగా రెండక్షరాల్లో కుదించేవాడు.

జ్ఞాన ప్రసూనాంబను 'ప్రజ్ఞ' గా మార్చేశాడు.

"నా పేరును పొడిచేస్తే నేనొప్పుకోను" అందామె.

"పొడిచేయలేదండీ, సారం తీశాను" అన్నాను.

ఆమె కందిన ముఖంతో ఆమోద పూర్వకంగా నవ్వటం నాకు బాగాగుర్తు. అంతే! ఆమె అసలు పేరు మాయమైంది

నేను యిప్పుడు స్పష్టంగా గుర్తిస్తున్నాను. అతనంటే నాకు అసూయగా వుండేది. విద్యార్థి సంఘం ఎలెక్షన్‌లో నేను రాజుతో పోటీ చేయటమే అందుకు రుజువు. రాజు ప్రచారంలో శ్రద్ధ తీసుకోలేదు. నేను డబ్బు ఖర్చు చేయటం మాత్రమే కాదు, రాజుకు ఆడపిచ్చి వుందని కొంత దుష్ప్రచారం కూడా చేశాను. ఇంతచేస్తే ఇరవై ఓట్ల తేడాతోనే గెలిచాను. ప్రిన్సిపాల్‌గారు ఫలితాలు ప్రకటించగానే, నా దగ్గరకు వచ్చి, 'కంగ్రాచ్యులేషన్స్' చెప్పి, "నిజంగా నా కంటే నువ్వే యీ పోస్టుకు తగినవాడివి రవీ" అన్నాడు ఆ అనటం మర్యాదకోసం కాదని నాకు తెలుసు.

"చిన్న టీ పార్టీ ప్లీజ్ కమాన్" అంటూ క్యాంటీన్‌లో నాకూ నా వెంట వున్న వాళ్ళకూ పార్టీ యిచ్చాడు.

నేనే ఓడిపోయివుంటే యెన్నటికీ యిలా ప్రవర్తించి వుండే వాడ్నికాదు.

నేనే అతనికి సన్నిహితం కాలేక పోయాను. అందుకే మా మధ్యన

మా స్వాతంత్ర్యోద్యమాన్ని
ముందుకు నడిపేజండా
మా నిర్భయ జీవితాన్ని
మోగే "స్వేచ్ఛా గీతం"

—అనిశెట్టి

---

'వైరస్నేహం' వంటిదే వుండేదేమో అతడు అమ్మాయిలతో ఎక్కువ కలిసి వుండటాన్ని నేను భరించలేక పోయేవాణ్ని. రెండో సంవత్సరంలో అతను ప్రజ్ఞతో ఎక్కువ చనువుగా వుండేవాడు

పరీక్షలకు ముందే ననుకుంటాను, అతడూ ప్రజ్ఞా పెళ్ళిచేసుకున్నారు, రిజిస్ట్రారాఫీసులో.

మేము పరీక్షల తర్వాత యిదే కలుసుకోవటం.

X X X

ఇల్లు సులభంగానే దొరికింది.

"పైకి" అన్నాడు రెండో అంతస్తునుండి. వెళ్ళాను.

రెండే రూములున్నట్టున్నాయి. బట్టలూ, పుస్తకాలూ చిందరవందరగా పడివున్నాయి.

"నీ పుస్తకం" అంటూ యిచ్చాడు. మొదటి పుటమీద 'రవికి' అని రాసి వుంది, రాజు సంతకంతో. ఆ పుస్తకం అరుదైందే కాకుండా ఖరీదైందికూడా. సందేహిస్తూ చూశాను.

"నేను రెండు మూడు సార్లు తిరిగేశాను రవి, నిజానికి నేను వాడిందే, నాకు పనికిరానిదే, నీ కిస్తున్నాను".

ఉల్లంబులు పల్లేరుల పొరలగ
కల్లబొల్లి నవ్వుల వెదజల్లుచు
తల్లడిల్లు బానిస ప్రాణాలకు
గొల్లున యేద్పే స్వాతంత్ర్యం బెపుడో

—కాళోజీ

---

అన్నాడు. ఇవ్వటానికి తానే సందేహిం చాలన్నట్టుగా.

"ఒక్కడివే వుంటున్నావా?"

"అవును రవి, సంవత్సరం నుండి ఒక్కణ్నే వుంటున్నాను. ఇప్పుడు ప్రజ్ఞ నాతో వుండటం లేదు. గుప్తా అనే డాక్టరుతో వుంటున్నది." ఎంత మామూలుగా చెప్పాలనుకున్నా కొంత బరువు దొరలింది మాటల్లో.

ఒక్కక్షణం నాకేం తోచ లేదు. మనస్సు ఖాళీ అయిపోయినట్టయింది. చిన్న కంపనం లాంటిది ఎక్కడో పుట్టి శరీరమంతా విస్తరించి, విడిచి వెళ్ళి పోయినట్ట నిపించింది.

అసలా వార్తను ఏ విధంగా తీసుకో వాలో అర్థం కాలేదు. ఇంకా వివరాల్లోకి పోవాలా? సానుభూతి చూపించాలా? మామూలు విషయంగా భావిస్తున్నట్టు నటించాలా?

రాజే మాట్లాడాడు.

"నిజం రవి, నా జీవితంలో అదొక ఎదురు చూడని అనుభవమే. ఆమెనన్ను వదలి వెళ్ళటానికి నా బాధ్యత కూడా వుంది".

"అంత అధ్వాన్నం పరిస్థితిని నువ్వు ప్రజ్ఞకు కల్గించి వుంటావంటే నేను నమ్మలేను."

"అలా అనకు నువ్వు నన్నొక మితునిగానే చూశావు. ఇంట్లో భర్తగా పురుషుని పాత్ర వేరు. ప్రతీ భర్త తన భార్యమ రూల్ చెయ్యాలనే చూస్తాడు తెలిసోతెలియకో నేనూ అదేపని చేశాను. ఆమెను మొండిగా ఉద్యోగం చెయ్యనీయ లేదు. అది నేను చేసిన బ్లండర్ ఆమెలో అసంతృప్తి ఆ విధంగా మొద లైంది. మూడో సంవత్సరం చాలా నిరు త్సాహంగా వుండేది. బహుశా యీ రొటీన్ లైఫ్‌తో, నాతో విసుగెత్తి పోయి వుంటుంది.

"మరి పిల్లలూ..." అన్నాను. ఆ నాలుగేళ్ళలో పిల్లలు పుట్టే వుంటారని వూహిస్తూ.

"లేరు. పిల్లలుకలుగిక పోవటంకూడా ఆమెను చాలా వేధించింది. ఇందుకోసమే డాక్టర్ గుప్తా దగ్గరకు వెళ్ళేవాళ్ళం. అతడు తనకు తెలిసిన లేడీ డాక్టర్ దగ్గ రకు పంపించాడు. మామూలు అనారోగ్యా లకు అతని దగ్గరకే వెళ్ళేది. మంచి ప్రాక్టీస్ వున్న కుర్ర డాక్టర్. అతని ఆకర్షణకు లోనైంది."

"ఆకర్షణకు లోనవటం సామాన్య విషయమే. నీతోవున్న బంధం తెంపేసు కోవటం మాటేమిటి?"

"నేనూ ఆ భ్రమలోనే వున్నాను. నేను అనుకున్నంత గట్టిబంధం కాదది. ఆమె నాపెళ్ళాం కావటమే నా అశ్రద్ధకు కారణమేమో. ఒకవేళ పెళ్ళి చేసుకో

కుండానే. ఆమెతో సంబంధం కలిగి వుంటే ఆమె ప్రేమకోసం, తృప్తికోసం శ్రద్ధ చూపేవాణ్నేమో.

'మరి ఆమె డాక్టర్‌లో ఏంచూసింది. కేవలం పై మెరుపేనా ?'

"నేను వాళ్ళ అనుబంధం అంచనా వేసే ప్రయత్నం చెయ్యలేదు." ఇక ఆ విషయాన్ని పొడిగించటం నాకు బాగనిపించలేదు. వేరేవిషయాలమీదికి సంభాషణను మళ్ళించాను. అద్దెకొంపలను గురించి, ప్రయాణపు ఇబ్బందులను గురించి, నా ట్రాన్స్‌ఫర్ ప్రయత్నాలను గురించి. కొంతసేపు మాట్లాడి వచ్చేశాను.

ఆ తర్వాత ఒకటీరెండుసార్లు రాజును లైబ్రరీలో కలుసుకున్నాను. మూడు నెలల తర్వాతనుకుంటాను, నా ప్రయత్నాలు ఫలించి తెలుగుదేశానికి ట్రాన్స్‌ఫర్ అయింది. సామానంతా ట్రాన్స్‌పోర్ట్ వాడికి అప్పగించి, ఒక లెదర్ బ్యాగ్ మాత్రం భుజాన వేసుకొని, రాజుకు ప్రజంట్ చెయ్యటానికి రెండు పెయింటింగ్స్ కొని, అతని యింటికి వచ్చాను. తలుపు మూసివుంది. లోపలి నుండి నవ్వులు వినిపిస్తున్నాయి.

బెల్లు నొక్కగానే రాజు తలుపు తీశాడు.

"హలో రవీ, నువ్వా. కమాన్" అన్నాడు.

లోనికి నడిచాను.

## జలపాతం

పేదల రుధిరాశ్రువులు
పొంగై, పొంగై, జల పాతమయింది
హృదయ విపంచిక తీగెల్లో
కరంటు ప్రవహిస్తుంది.
ప్రతి సీటి కణం
నయాగరా ఉద్వేగం
అగ్ని పర్వతం బ్రద్దలయి లావావచ్చేలా
కందరాల కొండల నుండి
ప్రళయ శక్తి విజృంభిస్తుంది
గుండెల పిడికిళ్ళలో సమ దాల్చింది
పీడిత జనం ముందంజ వేస్తుంది.

-ఎస్. సింహాచలం

---

ప్రజ్ఞ!

మంచంమీద కూర్చుని వులెన్ అల్లుతున్నది.

"గుర్తుపట్టావా? మన క్లాస్‌మేట్ రవి."అన్నాడు.

"నమస్కారం" అంటూ కుర్చీలో కూర్చున్నాను.

"ఓ, మీరా! కొంచెం లావెక్కారు." అంది.

ఆమె ఏమీ మారనట్టే కనిపించింది. నా ట్రాన్స్‌ఫర్ సంగతి చెప్పాను. రాజు కదలిపోయాడు.

"ఇంత తొందరగా విడిపోతామనుకోలేదు." అన్నాడు.

పెయింటింగ్స్ చేతిలో పెట్టాను

వాటిని చూసి రాజు చాలా సంతోషించాడు.

"బాగున్నాయి రవీ. ముఖ్యంగా యీ లేత పసుపు, ముదురు నీలాల సమ్మేళనం బాగుంది." అన్నాడు, ఒక పెయింటింగ్‌ను చూపిస్తూ. వెంటనే ఖాళీగావున్న మేకులకు తగిలించాడు.

"కాఫీ చేస్తాను" అంటూ లేవబోయింది. ఆ కదలికలో ఆమెగర్భంతో వున్నట్టు గమనించాను.

"వద్దులే ఎలాగూ స్టేషన్ వరకూ వెళ్తానుగదా, అక్కడే తీసుకుంటాంలే." అంటూ బట్టలేసుకున్నాడు.

ఆటోలో బయలుదేరాము. తోవలో అడిగాను.

"ప్రజ్ఞ ఎప్పుడొచ్చింది ?"

"పదిరోజులౌతోంది. డాక్టర్ గుప్తా పై చదువుకు లండన్ వెళ్ళిపోయాడు. ఈమెను తన వెంట రానియ్యలేదు. అతడు అక్కడే స్థిరపడాలనుకుంటున్నాడట కూడా."

"తప్పనిసరై నీ దగ్గరకు వచ్చిందన్నమాట."

"కావచ్చు. ఆమెతో కలసివుండటానికి నాకేమీ అభ్యంతరం కనిపించలేదు. డెలివరీ తర్వాత ఉద్యోగంకోసం కూడా ప్రయత్నించాలనుకుంటున్నాను. ఒకప్పుడు భార్యాభర్తల మనే విషయం మరచి పోగలిగితే మేం సుఖపడగలమనుకుంటా."

నేను అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాను. పొంగు తీరింతర్వాత ఒక నిశ్చలమైన అవగాహన లాంటిది వాళ్ళ నడుమ ఏర్పడిందనిపించింది.

స్టేషన్ వచ్చింది. క్యాంటిన్‌లో కాఫీ తాగుతున్నా, కంపార్ట్‌మెంటులో నా బెర్త్‌ను వెతుక్కుంటున్నా. నన్నునేను ప్రశ్నించుకుంటూనే వున్నాను. నాకు తోచిన జవాబులు యిచ్చుకుంటూనే వున్నాను.

"రాజు తిరస్కరించివుంటే?" అన్న ప్రశ్న వేసుకున్నప్పుడు, నా దృష్టిలో రాజుచేసింది త్యాగమే. 'అవసరం' అనే దృష్టితో చూసినా ఆమెకే అతని అవసరం ఎక్కువ.

కాని సాంఘికనీతి పేరుతో పాతుకున్న మనోభావాల సంగతేమిటి? వీటిని అధిగమించి ఆలోచించాడా?

అదే రాజును ప్రశ్నించాను.

"అంటే 'చెడిపోవటం' గురించేగదా నువ్వడిగేది. దాన్ని చెడిపోవటం అనుకుంటే, నేను చెడకుండా వుండేగద. మనం మనస్సులో ఎన్నో పక్కతోవలు తొక్కుతుంటాం, ఆచరణలో మాత్రమే అది తప్పు అనుకుంటే ఒప్పుకోను." అన్నాడు.

గార్డు పచ్చజెండా వూపాడు.